క్లుప్తంగా

రేపు మండల మీట్

చిలమత్తూరు: మండల సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 15న నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రామ్‌కుమార్ తెలిపారు. మండలంలో చేపట్టిన, చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై సర్వసభ్య సమావేశంలో చర్చించనున్నట్లు పేర్కొన్నారు. ఎంపీపీ అధ్యక్షతన జరిగే సమావేశానికి వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరు కావాలన్నారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

హిందూపురం: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ ఆయుర్వేద మెడికల్ ఆఫీసర్ అనూరాధ తెలిపారు. సోమవారం మండలంలోని గోళాపురం, సంతేబిదనూర్ యూపీ స్కూల్స్‌లో వైద్యశిబిరాలు నిర్వహించి విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. హెచ్‌ఎం గోవిందప్ప, సోమశేఖర్, యోగ శిక్షకులు సూర్యకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పైపుల ధ్వంసం

గోరంట్ల: మండల పరిధిలోని వానవోలు తండాకు చెందిన రైతు వెంకటరమణ నాయక్ వేరుశనగ పంట సాగుకు వినియోగిస్తున్న స్ప్రింక్లర్ పైపులను సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. పైపుల ధ్వంసంతో ఆర్థికంగా నష్టపోయానని, పంట సైతం ఎండిపోయే ప్రమాదం ఏర్పడిందని బాధిత రైతు వాపోయారు.

కోతులగుట్టలో నాకాబందీ



నాకాబందీలో పాల్గొన్న సీఐ సురేష్‌బాబు, సిబ్బంది

మడకశిరరూరల్: మండల పరిధిలోని కోతులగుట్ట గ్రామంలో సోమవారం సీఐ సురేష్ బాబు ఆధ్వర్యంలో ఎస్‌ఐలు, సిబ్బంది నాకాబందీ నిర్వహించారు. గ్రామంలో తనిఖీలు నిర్వహించి అసాంఘీక కార్యకలాపాలు, బాల్యవివాహాలు, సహజ మరణాలు తదితర వాటిపై అడిగి తెలుసుకున్నారు. రికార్డులు లేని నాలుగు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సురేష్‌బాబు తెలిపారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

హిందూపురం: ప్రభుత్వం కల్పిస్తున్న విద్యా సదుపాయలు సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ అన్నారు. సోమవారం స్థానిక దుర్గాబాయి దేశ్‌ముఖ్ యూపీ స్కూల్‌ను చైర్‌పర్సన్‌తో పాటు వైస్‌చైర్మన్ జబీవుల్లా పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు, విద్యార్థులకు పలు సూచనలు చేశారు.

బైక్‌ను ఢీ కొన్న ఆర్టీసీ బస్సు

పెనుకొండ రూరల్: ద్విచక్ర వాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటన పెనుకొండ 44వ జాతీయ రహదారిపై సోమవారం ఉదయం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు... పెనుకొండ పట్టణానికి చెందిన కొల్లప్ప కోటక్ పరిశ్రమ వైపు నుంచి జాతీయ రహదారి మీదకి వెళ్తున్నారు. అయితే బెంగళూరు వైపు నుంచి అనంతపురం వైపు వెళ్తున్న నందికొట్కూరు డిపోకి చెందిన ఆర్టీసీ బస్సు ద్విచక్ర వాహనాన్ని ఢీ కొంది. గాయపడిన కొల్లప్పను స్థానికులు హుటాహుటిన హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

సర్వే త్వరగా పూర్తి చేయండి

అమరాపురం: మండలంలోని సచివాలయాల కార్యదర్శులు అన్ని శాఖలకు సంబంధించిన వివరాలను మిషన్ అంత్యోదయలో తప్పక నమోదు చేయాలని ఎంపీడీఓ మునిస్వామి అధికారులకు సూచించారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సచివాలయం కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయం, హర్టికల్చర్, పశుపోషణ, రెవెన్యూ, తదితర శాఖలకు సంబంధించిన వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శులు ఈఓఆర్డీ సుధాకర తదితరులు ఉన్నారు.

బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ సీపీఐ నిరసన


పావగడ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశ పెట్టిన బడ్జెట్ బిల్లును వ్యతిరేకిస్తూ స్థానిక సీపీఐ నాయకులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా తాలూకా కార్యాలయం ఎదుట చేపట్టిన నిరసనలో స్థానిక సీపీఐ కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశ పెట్టిన బడ్జెట్ పూర్తిగా ప్రజా వ్యతిరేకమని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాయకురాలు అశ్విని, పురుషోత్తం, నంజుండ, అంజి , భూలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేడు దుకాణాల వేలం

అమరాపురం: మండలంలోని హేమావతిలో వెలసిన సిద్దేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహించే అంగళ్లు, వాహనాల పార్కింగ్ కోసం వేలం పాటను మంగళవారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు కార్యదర్శి నరేష్‌కుమార్ తెలిపారు. వేలంలో పాల్గొనే వారు రూ.10 వేలు డిపాజిట్ చెల్లించి పాటలో పాల్గొనవచ్చన్నారు.

శివయ్యా.. పునఃదర్శనం ఎప్పుడయ్యా?

- ఏళ్లు గడచిపోతున్నా జరగని పరమేశ్వరుడి విగ్రహ పునఃప్రతిష్ట
- పట్టించుకోని కేంద్ర పురావస్తుశాఖ అధికారులు



రత్నగిరిలోని సార్వటేశ్వర దేవాలయం

రొళ్ల: మండల పరిధిలోని చారిత్రాత్మక ప్రదేశమైన రత్నగిరి గ్రామంలో ఉన్న సార్వటేశ్వరుని (ఈశ్వర) ఆలయం ఎంతో పురాతనమైనది. అయితే శిథిలావస్థకు చేరుకున్న ఆలయాన్ని 8 ఏళ్ల క్రితం రూ.4 లక్షల నిధులతో కేంద్ర పురావస్తుశాఖ ఆధ్వర్యంలో మరమ్మతులు చేశారు. ఈ నేపథ్యంలో దెబ్బతిన్న సార్వటేశ్వరుడి విగ్రహాన్ని తొలగించారు. అప్పటి నుంచి నేటి దాకా తిరిగి నూతన విగ్రహాన్ని మాత్రం ప్రతిష్టించలేదు. ఉమ్మడి జిల్లాలోని పర్యాటర కేంద్రంగా ప్రసిద్ధి చెందిన శైవ క్షేత్రంలో రత్నగిరి కూడా ఒకటి. ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచే కాకుండా సమీప కర్ణాటక ప్రాంతాల నుంచి రత్నగిరికి పెద్ద ఎత్తున పర్యాటకులు, భక్తులు తరలివస్తుంటారు. కొల్లాపురి మహాలక్ష్మిదేవితో పాటు పురాతన దేవాలయంలో ఈశ్వరుని ఆలయాన్ని కూడా భక్తులు సందర్శించుకుంటుంటారు. అయితే శివుని విగ్రహం లేకపోవడం విచారకరమని స్థానికులతో పాటు భక్తులు కూడా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దీంతో పాటు రత్నగిరి చరిత్రను (విశిష్టత) వివరించే గైడ్ కూడా లేకపోవడంతో సందర్శకులు విషయాలు తెలుసుకోలేకపోతున్నారు. గ్రామంలో 8 కళ్యాణి బావులు, కట్టడాలు, బురుజులు, అంతఃపురం, శిల్పకళలు, రాతి ఏనుగులు, ఇంద్రసేన కోట, గంట ఆకారంలో నేతిదోణి, శత్రువులను పసిగట్టేందుకు కొండ పై రంధ్రాలు, ఏత్తైన బురుజులు ఇలా ఎన్నో చారిత్రక కట్టడాలు ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత పురావస్తుశాఖ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుని ఆలయంలో శివుని విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని సందర్శకులు, స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

స్వచ్ఛందంగా ఏర్పాటు చేయొచ్చు

రత్నగిరి గ్రామంలో ఉన్న సార్వటేశ్వరుని ఆలయంలో స్వామి వారి విగ్రహాన్ని ఎవరైనా దాతలు స్వచ్ఛంగా ఏర్పాటు చేయొచ్చు. దీనికి సంబంధించి మా తరఫున పూర్తిగా సహాయ సహకారాలు అందిస్తాం.

- రజిత, ఏడీ, పురావస్తుశాఖ

జగనన్నకు రుణపడి ఉంటాం

పెనుకొండ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు ఎప్పుడూ రుణపడి ఉంటామని 1998 డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులు తెలిపారు. సోమవారం డీఎస్సీ అభ్యర్థులు పట్టణములో సమావేశం నిర్వహించారు. మంత్రి వర్గ సమావేశంలో 24 సంవత్సరాల తర్వాత 4,534 టీచర పోస్టు భర్తీకి ఆమోదం తెలపడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో మారుతీ ప్రసాద్‌రెడ్డి, షాజహాన్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీ

రొళ్ల: ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపి నాణ్యమైన విద్యను అందించాలని ఎంఈఓ శ్రీధర్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని గొట్టుగుర్కి నసేపల్లిగొల్లహట్టి, వన్నప్ప పాళ్యం, గుడ్డగుర్కి ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలను సందర్శించారు. ఆయా పాఠశాలల్లో రికార్డులు పరిశీలించి విద్యార్థుల హాజరు శాతాన్ని అడిగి తెలుసుకున్నారు.

ఎన్‌టీఆర్ విగ్రహానికి ముసుగు

సాక్షి ఎఫెక్ట్..

పెనుకొండ: 'ఎందుకిలా?' అన్న శీర్షికన 'సాక్షి' దినపత్రికలో సోమవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఇందులో భాగంగానే పట్టణంలో ఉన్న ఎన్‌టీఆర్ విగ్రహానికి అధికారులు ముసుగు వేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అధికారులు ఎట్టకేలకు స్పందించి చర్యలు తీసుకున్నారు.



పెనుకొండలో ఎన్‌టీఆర్ విగ్రహానికి ముసుగు వేసిన దృశ్యం

వాలీబాల్ టోర్నీ విజేత పులమతి



బాలికల విభాగంలో విజేతలకు ట్రోఫీలను అందజేస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: స్థానిక బాలాజీ జూనియర్, డిగ్రీ కళాశాలలో రెండు రోజుల పాటు జరిగిన అంతర్ పాఠశాలల వాలీబాల్ టోర్నమెంట్ సోమవారం ముగిసింది. టోర్నీలో హిందూపురం, పరిగి, లేపాక్షి, చిలమత్తూరు, గోరంట్ల మండలాల్లో ఉన్నత పాఠశాలల నుంచి 39 బాల, బాలికల జట్లు పోటీ పడ్డాయి. బాలికల విభాగంలో లేపాక్షి మండలం పులమతి ఉన్నత పాఠశాల జట్టు విన్నర్‌గా నిలిచి ప్రథమ బహుమతి గెలుచుకుంది. అలాగే పైడేటి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ద్వితీయ బహుమతి, ధనాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు తృతీయ బహుమతి దక్కింది. బాలుర విభాగంలో చౌళూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ప్రథమ బహుమతి, దేమకేతేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ద్వితీయ , మలుగూరు ఏపీడబ్ల్యూఎస్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తృతీయ బహుమతి సాధించాయి. గెలుపొందిన జట్లకు ట్రోఫీలను అందజేశారు. కార్యక్రమంలో బాలాజీ కళాశాల ప్రిన్సిపాల్ వీరభద్రప్ప, వైస్ ప్రిన్సిపాల్ గోపాలకృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు



ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేసిన రెవెన్యూ సిబ్బంది

గోరంట్ల: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వెనుక భాగంలోని 271–1,4వ లేటర్‌లోని ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మాణాలు చేపడితే చట్టపరమైన చర్యలు తప్పవని తహసీల్దార్ రంగనాయకులు హెచ్చరించారు. నకిలీ పట్టాలతో ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన వ్యక్తులపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారన్నారు. సోమవారం తహసీల్దార్ రంగనాయకులు తన సిబ్బందితో కలసి సదరు ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు.

కల్తీ కల్లు తాగి వ్యక్తి మృతి !

హిందూపురం: పట్టణంలోని అంబేడ్కర్‌నగర్‌కు చెందిన నరసింహమూర్తి (27) సోమవారం సాయంత్రం కల్తీ కల్లు తాగి మృతి చెందాడు. మృతుని భార్య వరలక్ష్మి వన్‌టౌన్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు... నరసింహమూర్తి మేళాపురంలోని కల్లు దుకాణం వద్దకు వెళ్లి కల్లు తాగి కొద్ది సేపటికి అక్కడే పడిపోయాడు. వెంటనే అక్కడి వారు అతన్ని ఆటోలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అతను చనిపోయినట్లు చెప్పి శవాన్ని పోస్టుమార్టం గదికి తరలించారు. విషయం తెలుసుకున్న బంధువులు, అంబేడ్కర్ నగర్ వాసులు వన్‌టౌన్ వద్దకు తరలివచ్చి న్యాయం చేయాలని ఆందోళనకు దిగారు. దీంతో సీఐ ఈరన్న మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు పిల్లలున్నారు.

కాంట్రాక్టర్ల నుంచి కొటేషన్ల ఆహ్వానం

లేపాక్షి: లేపాక్షి ఆలయంలో వెలసిన వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో చేపట్టే పనులకు కాంట్రాక్టర్ల నుంచి కొటేషన్లు ఆహ్వానిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి నరసింహమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 17 నుంచి 21 వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. ఉత్సవాల కోసం లైటింగ్, డెకరేషన్, రిపేర్, మెటల్‌పాలీష్, ఫ్లవర్ డెకరేషన్ తదితర వాటి కోసం ఈనెల 16 లోపు కొటేషన్లు సమర్పించాలని సూచించారు.

జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్‌లో ప్రతిభ



పి.యశ్వంత్

మడకశిర(అగళి): అగళి పట్టణం సమీపంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న పి.యశ్వంత్ సోమవారం శ్రీసత్యసాయి జిల్లా కేంద్రం పుట్టపర్తిలో జరిగిన జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్ పోటీలో రెండో స్థానంలో నిలిచారు. దీంతో అగళి ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌తో పాటు స్థానిక తహసీల్దార్, వీఆర్వోలు, వీఆర్ఏలు, ఏపీ మోడల్ స్కూల్ సిబ్బంది యశ్వంత్‌ను అభినందించారు.

పాఠశాలలకు నోటీసులు

హిందూపురం టౌన్: పట్టణంలోని ప్రీ ప్రైమరీ పాఠశాలల్లో అనుమతులు లేని వాటికి ఎంఈఓ గంగప్ప నోటీసులను జారీ చేశారు. సోమవారం పట్టణంలోని సత్యనారాయణపేటలో గల యూరో కిడ్స్, నానెప్పనగర్‌లోని సన్‌రైజర్స్ తదితర ప్రీ ప్రైమరీ పాఠశాలలను ఎంఈఓ గంగప్ప పరిశీలించారు. అనుమతులు లేకపోవడంతో వారికి నోటీసులను జారీ చేశారు.

పట్టాలివ్వాలని రైతుల ఆందోళన

రొద్దం: మండలంలోని శ్యాపురం, కంబాలపల్లి, కోగిర గ్రామాలకు చెందిన రైతులు ప్రభుత్వ భూముల్లో సాగు చేస్తుకుంటున్నామని .. తమకు పట్టాలు మంజూరు చేయాలని సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. సర్వేనంబర్ 666, 667, 668, 669లో 500 ఎకరాలు ప్రభుత్వ భూమి సాగులో ఉన్న తమకు న్యాయం చేయాలని కోరారు.

క్రికెట్ టోర్నీ విజేత గౌరిగానపల్లి

లేపాక్షి: మండలంలోని గౌరిగానపల్లిలో సర్పంచ్ నిర్మల, ఆమె భర్త, వైఎస్సార్‌సీపీ నాయకుడు వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఉదయం క్రికెట్ పోటీలను నిర్వహించారు. గౌరిగానపల్లి , జగిరెడ్డిపల్లి జట్లు తలపడగా గౌరిగానపల్లి జట్టు విజేతగా, జగిరెడ్డిపల్లి జట్టు రన్నరప్‌గా నిలిచాయి. విజేతకు రూ.12 వేలు, రన్నరప్‌కు రూ.7 వేలు అందించారు.

నార్శింపల్లికి టీఎస్‌పీఎస్సీ చైర్మన్




టీఎస్‌పీఎస్సీ చైర్మన్ జనార్దనరెడ్డి దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

గోరంట్ల: తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ జనార్దనరెడ్డి దంపతులు సోమవారం నార్శింపల్లికి విచ్చేశారు. స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రామలింగారెడ్డి, ఆయన తనయుడు నార్శింపల్లి మాజీ సర్పంచ్ వెంకటశివారెడ్డి వారికి స్వాగతం పలికారు. జనార్దనరెడ్డి గతంలో ఉమ్మడి అనంతపురం జిల్లా కలెక్టర్‌గా పనిచేశారు. రామలింగారెడ్డితో ఉన్న వ్యక్తిగత పరిచయాల వల్ల ఆయన నివాసానికి వచ్చినట్లు స్థానికులు తెలిపారు.

కొనసాగుతున్న వైఎస్సార్ టీ-10 క్రికెట్ టోర్నీ

మడకశిరరూరల్: మండల పరిధిలోని సీ కొడిగేపల్లిలో కాపు సురేష్‌రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న వైఎస్సార్ టీ–10 జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా సోమవారం వివిధ జట్లు తలపడ్డాయి. బీ రాయాపురం జట్టుపై హిందుపురం జట్టు గెలుపొందింది. సోమఘట్ట జట్టుపై మడకశిర జట్టు, కదిరి జట్టుపై రొళ్ల జట్టు విజయం సాధించాయని నిర్వాహకులు కాపు సురేష్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో అనిల్‌కుమార్‌రెడ్డి, సునీల్‌రెడ్డి, వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



ప్రమాదంలో పాక్షికంగా దెబ్బతిన్న కారు

పెనుకొండ రూరల్: లారీ– కారు ఢీ కొన్న ఘటన సోమవారం పెనుకొండలోని 44వ జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు... అనంతపురం వైపు నుంచి పెనుకొండ పట్టణంలోకి వెళ్తున్న ఓ లారీ హరిపురం వైజంక్షన్ వద్ద రోడ్డు దాటే క్రమంలో అటుగా బెంగుళూరు వైపు నుంచి అనంతపురం వెళ్తున్న కారు పరస్పరం ఢీ కొన్నాయి. కారు పాక్షికంగా దెబ్బతినగా ప్రమాదలంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

డ్రైనేజీ నిర్మాణానికి భూమి పూజ

పరిగి: మండలంలోని కొడిగెనహళ్లి మేజర్ పంచాయతీలో డ్రైనేజ్ నిర్మాణానికి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. సీఎండీఎఫ్ నిధులతో మంజూరైన రూ.8 లక్షల వ్యయంతో స్థానిక విద్యానగర్‌లోని శాసనకోట రోడ్డు పక్కన సర్పంచ్ శ్రీరామప్ప, ఎంపీపీ సవిత, వైస్ ఎంపీపీలు వేదవతి, శకుంతలమ్మ ఆధ్వర్యంలో డ్రైనేజ్ నిర్మాణానికి పనులు ప్రారంభించారు.

పనులు వేగవంతం చేయండి



రహమత్‌పురంలో డ్రైనేజీలపై ఆక్రమణలను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

హిందూపురం: పట్టణంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైల్వేరోడ్డు నిర్మాణ పనులు వేగవంతం చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్‌చైర్మన్ జబీవుల్లా అన్నారు. సోమవారం రైల్వే రోడ్డులో జరుగుతున్న సైడ్ కాలువల నిర్మాణ పనులను వారు పరిశీలించారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి రైల్వేరోడ్డును మోడల్ రహదారిగా తీర్చిదిద్దుతామన్నారు.

ఆక్రమణలు తొలగిస్తాం

పట్టణంలోని డీఎల్ రోడ్డు, 16వ వార్డు రహమత్ పురం ప్రాంతాల్లో ప్రజా సౌకర్యం కోసం ఆక్రమణలు తొలగించి రోడ్డుకు ఇరుపక్కలా కొత్త కాలువలు నిర్మిస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ తెలిపారు. డీఎల్‌రోడ్డులో అక్రమ కట్టడాల వల్ల వాహనాలు, ప్రజల రాకపోకలకు చాలా ఇబ్బందిగా ఉందన్నారు. కాలువలు కూడా శుభ్రం చేయడానికి వీలు లేకుండా ఉందన్నారు. వీటిన్నంటిని తొలగించి ఇబ్బందులు తొలగిస్తామన్నారు.

ఆర్వో ప్లాంట్లకు మరమ్మతు చేయాలి



ర్యాలీ నిర్వహిస్తున్న జేడీఎస్ నాయకులు, కార్యకర్తలు

పావగడ: చెడిపోయిన ఆర్వో ప్లాంట్లకు మరమ్మతు చేపట్టి ప్రజల దాహార్తి తీర్చాలని డిమాండ్ చేస్తూ స్థానిక జేడీఎస్ నాయకులు సోమవారం పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. ఎస్ఎస్‌కే రంగ మందిరం నుంచి జిల్లా పంచాయతీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జెడ్పీ కార్యాలయాన్ని ముట్టడించారు. తాలూకా వ్యాప్తంగా సుమారు 150 ఆర్వో ప్లాంట్లు చెడి పోయి సంవత్సరాలు గడుస్తున్నా సంబంధిత తాగునీటి సరఫరా శాఖ అధికారులు పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే మరమ్మతు చేయించాలన్నారు. కార్యక్రమంలో జేడీఎస్ కార్యాధ్యక్షుడు ఎస్‌ఏ ఈరణ్ణ, అధ్యక్షుడు బలరామరెడ్డి, గోవింద బాబు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో నీటి సమస్య పరిష్కారం



విద్యార్థిని శుద్ధనీటిని అందజేస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: మండల పరిధిలోని సీ.చెర్లోపల్లిలోని ఏపీ ఆదర్శ పాఠశాలలో ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ కృషితో శుద్ధనీరు అందుబాటులోకి వచ్చింది. సోమవారం ఆదర్శ పాఠశాలలో ఆర్‌ఓ ప్లాంట్‌ను పునఃప్రారంభించి విద్యార్థులకు శుద్ధ నీటిని అందజేశారు. గత కొన్ని నెలలుగా పాఠశాలలో ఆర్‌ఓ ప్లాంట్ పనిచేయడం లేదు. ఈ నేపథ్యంలో విషయాన్ని పాఠశాల కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఎమ్మెల్సీ దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ తన సొంత ఖర్చులతో రూ.35 వేలును వెచ్చించి ఆర్‌ఓ ప్లాంట్‌ను మరమ్మతు చేయించారు. సోమవారం పాఠశాల ప్రిన్సిపాల్ అశోక్‌కుమార్, స్కూల్ కమిటీ చైర్మన్ శ్రీనాథ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు అశ్వర్థరెడ్డిలు ఆర్‌ఓ ప్లాంట్‌ను పునఃప్రారంభించి, శుద్ధ నీటిని విద్యార్థులకు అందజేశారు.

బాల్య వివాహాలు అరికట్టేందుకు కృషి



మాట్లాడుతున్న తహసీల్దార్ హసీనా సుల్తానా

రొళ్ల: బాలికలకు యుక్త వయస్సు వచ్చే వరకు బాల్య వివాహాలు జరపకుండా గ్రామస్థాయి అధికారులు ప్రజలకు, తల్లిదండ్రులకు తెలియజేసి చైత్యవంతులను చేయాలని తహసీల్దార్ హసీనాసుల్తానా, ఐసీడీఎస్ సీడీపీఓ నాగమల్లేశ్వరి, చైల్డ్‌లైన్ 1098 జిల్లా కోఆర్డీనేటర్ కృష్ణమాచారి తెలిపారు. సోమవారం సాయంత్రం స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో చైల్డ్‌లైన్ 1098 అడ్వైజరీ బోర్డు, బాల్య వివాహ నిరోధక కమిటీ ఏర్పాటుపై ఆరోగ్య, అంగనవాడీ వర్కర్లు, పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బందితో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి తహసీల్దార్ హసీనాసుల్తానా అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ నేటి సమాజంలో బాలికలపై వేధింపులు ఎక్కువ కావడం వల్ల వాటిని నిరోధించడం కోసం ప్రతి ఒక్కరూ చర్యలు తీసుకోవాలన్నారు. బాల్య వివాహ వ్యవస్థను పూర్తిగా నిర్మూలిద్దామన్నారు. గ్రామ స్థాయిలో సర్పంచ్ అధ్యక్షతన కమిటీలు ఏర్పాటు చేసుకుని బాల్య వివాహాలు అరికట్టి బాల్య వివాహాలు లేని ఆదర్శ గ్రామాలు తీర్చుదిద్దుకొందామన్నారు. బాల్య వివాహాలు జరిపే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాల్య వివాహాలు చేయడం ద్వారా జరిగే అనర్థాలను ప్రజలకు, తల్లిదండ్రులకు వివరించాలని సూచించారు. ఈ సందర్భంగా మండల స్థాయిలో తహసీల్దార్ అధ్యక్షురాలిగా, ఉపాధ్యక్షులుగా ఎంపీడీఓ, కన్వీనర్‌గా సీడీపీఓ, వివిధ శాఖల అధికారులు కమిటీ సభ్యులుగా ఉంటారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఏఓ ఆరాధ్య, ఎంఈఓ శ్రీధర్, డాక్టర్ బాలప్రవీణ్‌రెడ్డి, ఏపీఎం భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

లేపాక్షి: మండల కేంద్రంలోని బీసీ కాలనీలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని సోమవారం ఉదయం గ్రామ సర్పంచ్ ఆదినారాయణ తనిఖీ చేశారు. అంగన్‌వాడీ సిబ్బంది, పిల్లల హాజరు పట్టికతో పాటు పలు రిజిష్టర్లను పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం పిల్లలకు అందిస్తున్న పోషకాహారం నాణ్యతపై ఆయన ఆరా తీశారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



పెనుకొండ: మద్యాన్ని చూపుతున్న పోలీసులు



గోరంట్ల: స్వాధీనం చేసుకున్న మద్యాన్ని చూపుతున్న పోలీసులు

గోరంట్ల: కర్ణాటక రాష్ట్రం నుంచి జిల్లాలోకి అక్రమంగా కర్ణాటక మద్యాన్ని తరలిస్తున్న కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఇద్దరితో పాటు మండల పరిధిలోని బూదిలి తండా సమీపంలో కర్ణాటక మద్యం విక్రయిస్తున్న మరో వ్యక్తిని సోమవారం అరెస్టు చేసినట్లు సీఐ సుబ్బరాయుడు తెలిపారు. మండల పరిధిలోని కాగానిపల్లి వద్ద కర్ణాటక రాష్ట్రం వడ్డేరహళ్లికి చెందిన చంద్రశేఖర్, రామ్మోహన్‌లను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. అదే విధంగా బూదిలి తండా సమీపంలో కర్ణాటక మద్యం విక్రయిస్తున్న చరణ్ నాయక్ అనే వ్యక్తి అరెస్టు చేశామన్నారు. ఈ ముగ్గురి నుంచి 574 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేశామన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి పెనుకొండ కోర్టులో హాజరు పరిచామన్నారు.

పెనుకొండ: 44వ నంబర్ జాతీయ రహదారిపై టాటా ఏస్ వాహనంలో తరలిస్తున్న 10 క్వింటాళ్ల రేషన్ బియ్యంతో పాటు దాదాపుగా రూ.35 వేలు విలువచేసే కర్ణాటక మద్యాన్ని సోమవారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ రమేష్ బాబు తెలిపారు. ఇస్లాపురం వార్డుకు చెందిన రబ్బానీ , వెంకటేష్‌లను అదుపులోకి తీసుకొని మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే సోమందేపల్లికి చెందిన శాంతమ్మ వాహనంలో డ్రైవర్ సందీప్ టన్ను చౌక బియ్యం తరలిస్తుండగా అరెస్టు చేశామన్నారు.